ప్రజాశక్తి
బుధవారం 27 సెప్టెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

ఉధృతంగా చిట్టిగెడ్డ ప్రవాహం

15 గ్రామాల గిరిజనుల రాకపోకలు కట్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో మంగళవారం సాయంత్రం ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చిట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహించింది. దీంతో మార్కొండి పుట్టి నుంచి నంద వైపు వెళ్లే సుమారు 15వ గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గెడ్డపై మార్కొండపుట్టి సమీపాన చిన్నపాటి వంతెన నిర్మించగా, శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏమాత్రం గెడ్డ ఉధృతి వచ్చినా ఈ వంతెనపై ప్రవాహం రావడంతో గిరిజనుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్ష్యాత్తు డిప్యూటీ సీఎం రాజన్నదొర సొంత పంచాయతీకి ఆనుకొని ఉన్న చిన్నపాటి వంతెన కూడా కనీసం పట్టించుకోకపోవడంతో గిరిజనుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

చేతులు తడిపితేనే పనులు

విద్యుత్ కనెకన్ల మంజూరులో అధికారుల తీరు

టేకు చెట్టు మీదుగా వెళ్తున్న విద్యుత్ కనెక్షన్

ప్రజాశక్తి - మక్కువ

అవినీతికి అలవాటు పడ్డ అధికారుల చేతులు తడిపితే చాలు ఏ నిబంధనలైనా తిరగరాసే పరిస్థితి మండల విద్యుత్ శాఖలో చోటుచేసుకుందని చెప్పడంలో అతిశయోక్తి కాదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కయితే ఆ అవినీతి గురించి అసలు చెప్పనక్కరలేదు. సామాన్య రైతులకు ఒక తీరు, పలుకుబడి ఉన్న వ్యక్తులకైతే మరో విధంగా పనులు చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు మండలంలో మంజూరు చేసిన విద్యుత్ కనెక్షన్లే నిదర్శనం. ప్రభుత్వ నిబంధన నిబంధన ప్రకారం ఓ రైతుకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలంటే ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుండి సుమారు 180 మీటర్ల పరిధిలో అంటే సుమారు మూడు స్తంభాల దూరంలోగా అమర్చాల్సి ఉంటుంది. అయితే మండలంలో గత ఏడాది కాలంలో ఈ నిబంధన అంతంతమాత్రంగానే అధికారులు పాటిస్తూ సంబంధిత కాంట్రాక్టర్‌కు మేలు చేస్తూ తీసుకున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఒక ట్రాన్స్ఫార్మర్ నుండి సుమారు 300 మీటర్ల వరకు విద్యుత్ కేబుల్‌ను తీసుకువెళ్తూ కనెక్షన్ మంజూరు చేస్తూ ఆయా ప్రాంతాల్లో రైతుల నుండి దండిగా మామూళ్ళ వసూలు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారుల అంచనాలు కొన్నిచోట్ల అధికంగా వేస్తూ మరికొన్ని చోట్ల సాధారణంగా వేస్తూ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా గతంలో నిర్ణయాలు చేపట్టి తద్వారా విద్యుత్‌శాఖ అధికారులు భారీగా కాంట్రాక్టర్ ద్వారా లబ్ధిపొందినట్లు ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలోని మూకవలసకు వెళ్లే రహదారిలో విఆర్ఎస్ కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు సుమారు 300 మీటర్ల నిడివిలో టేకు చెట్లను ఆధారం చేసుకుని విద్యుత్ సర్వీస్ లైన్ వేయడం పలువురుని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అంతేకాక మండలంలోని కవిరిపల్లి - శంబర రహదారుల్లో ఇలాంటి విద్యుత్తు లైన్లు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పలు స్తంభాలపై కాంట్రాక్టర్ ఉపయోగించాల్సిన పనిముట్లు ఇన్సులేటర్లు, కేసరాలు అమర్చకుండానే వైర్లతో వేలాడ తీసి విద్యుత్ కనెక్షన్లు వేయడం దర్శనమిస్తుంది. అలాగే మక్కువ మెయిన్ బజార్లో ఓ షాపింగ్ కాంప్లెక్స్ కు 60 కెవిఎ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి తరుణంలో వివాదాలు రావడంతో అక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌కు కూడా సుమారు 300 మీటర్ల నుండి వేరొక ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్తును నేరుగా సరఫరా చేశారు. అయితే గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ఏమైందోనని పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పనులు జరుగుతున్న తీరును పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం కూడా ఈ దుస్థితి కారణమని కాంట్రాక్టర్‌తో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టినట్లయితే మరెన్నో అక్రమాలు వెలుగు చూసే ఆస్కారం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యమే జెఎఎస్ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించి సురక్షితంగా ఉండేందుకు ఇంటి వద్ద ఉచిత వైద్యం అందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని అడ్డాపుశీలలో గల మండల పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మోడల్ మెడికల్ క్యాంపును మంగళవారం ఆయన సందర్శించారు. వైద్య చికిత్స కోసం వచ్చిన బాధితుల రిజిస్ట్రేషన్ వివరాలు, కేస్ షీట్, మందుల నిల్వలు, వివిధ కౌంటర్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి తలుపు తట్టి ఆరోగ్య సమస్యలను పరీక్షించడంతో పాటు మెరుగైన వైద్యం అందించి నయం చేసేలా ప్రభుత్వం భాధ్యత తీసుకుంటుందన్నారు. రోగులను గుర్తించి ఉచితంగా ఏడు రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులు తహశీల్దార్, ఎంపిడిఒలు పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపిడిఒలు క్యాంపుల నిర్వహణను గ్రామ వాలంటీర్లతో ముందురోజు సమావేశాలు నిర్వహించి అందరికీ తెలియజేయడంతో పాటు వైద్యం కోసం వచ్చే బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్లాట్ విధానం పాటించాలన్నారు. కేన్సర్, కిడ్నీ వంటి దీర్ఘకాలిక బాధితులు ఉన్నట్లయితే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యుల సూచనల మేరకు మందులు అందిస్తామని తెలిపారు. అవసరమైతే ఆస్పత్రులకు తరలించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యాంపు పూర్తి బాధ్యతను ఫ్యామిలీ డాక్టర్ తీసుకుని మందుల కొరత లేకుండా అవసరమైన మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలతో పాటు రక్తహీనత బాధితులను గుర్తించి అవసరమైన మందులు, ఫుడ్ సప్లిమెంటేషన్ అందజేయాలన్నారు. బాధితులకు చికిత్స అందిస్తూనే జీవన శైలిలో తీసుకోవాల్సిన ఆహార నియమాలు, ఆయా వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణకు పాటించాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం కోసం అందుబాటులో ఉన్న సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. కంటి పరీక్షలు అనంతరం వృద్ధులకు కళ్లద్దాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రజలు ఇటువంటి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కొయ్యాన అప్పారావు, జిల్లా ఆర్బిఎస్కె అర్ బి ఎస్ కె అధికారి డాక్టర్ ధవళ భాస్కర రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు, ఐసిడిఎస్ పిడి కె.విజయ గౌరి, జిల్లా ఆసుపత్రి సూపరిండెండెంట్ డా, వాగ్దేవి, వైద్యులు, తహశీల్దార్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చదువు కోసం చిన్నారుల అవస్థలు

ప్రజాశక్తి - సీతంపేట

చింతమానుకాలనీకి చదువుకోడానికి నడిచి వెళ్తున్న గిరిజన చిన్నారులు

అందరూ చదువు కోవాలి అంటున్న పాలకులు అందు బాటులో పాఠశాల లను ఉంచడంలేదు. దీంతో చదువు కోడానికి గిరిజన చిన్నారులు రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్తూ నానా అవస్థలు పడుతు న్నారు. అందరికీ అందుబాటులో విద్య, ప్రతి గ్రామానికి కార్పొరేట్ తరహాలో పాఠశాల అంటూ పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉప న్యాసాలకు కొదవ లేదు. ఇందుకు నిదర్శనం మండలం లోని పూతికవలస. ఈ పంచాయతీలో పాఠశాల అందుబాటులో లేకపోవడంతో బంజరు గూడ, నడిమిగూడ, రాజీగాడి గూడ గ్రామాలకు చెందిన చిన్నారులు రెండుకిలోమీటర్ల దూరానున్న చింతమాను కాలనీకి నడుకుంటూ వెళ్తున్నారు. 25మంది గిరిజన విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారు. దీంతో మార్గ మధ్యలో చిన్నారులు ఎటువంటి ప్రమాదాలకు గురౌతారోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే పిల్లలు ఇంటికి వచ్చే వరకూ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని వారి కోసం ఎదురు చూస్తున్నామని వాపోయారు. తక్షణమే పూతికవలసలో పాఠశాల ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో భవిష్యత్తులో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిర్బంధానికి నిరసనగా మానవహారం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి గృహ నిర్బంధాలను, ముందస్తు అరెస్టులను, అణచివేతకు పాల్పడడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక గ్యాస్ ఆఫీస్ ఆవరణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ విమాప్రభ జిల్లా కోశాధికారి బి అమరవేణి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం తెలంగాణా కంటే అదనంగా వేతనం చెల్లిస్తానన్న హామీ అమలు చేయమని శాంతియుత ఆందోళన చేస్తున్న అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించిందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చట్టాన్ని అంగన్వాడీలకు అమలు చేయమని అడిగితే అరెస్టులు చేయించిందని, ఐదేళ్ల నుండి పెండింగ్ పెట్టిన టిఎ బిల్లులు చెల్లించమని కోరితే గృహనిర్బంధానికి పాల్పడిందని విమర్శించారు. అణిచివేత, నిర్బందాల ద్వారా పరిపాలన సాగించాలని వైసిపి ప్రభుత్వం భావిస్తుందని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరించారు. అంగన్వాడీలకు అరెస్టులు, కేసులు కొత్తేమీకాదని, గత ప్రభుత్వాలు ఇలాంటివి ప్రయోగించే అధికారాన్ని కోల్పోయిన విషయాన్ని గుర్తించుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్‌ఛార్జీలు, ఇంటి, చెత్త పన్నులు, నిత్యావసర సరుకుల ధరలు పెంచుతున్న జగన్ ప్రభుత్వానికి అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని కనీసజ్ఞానం లేదా అని ప్రశ్నించారు. పోరాడేతత్వం కలిగిన అంగన్వాడీలతో దురుసుగా వ్యవహరించి జగన్ తన రాజకీయ భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.జెస్సీబాయ్, ఆర్.భవాని, ధనలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతలపై అక్రమ కేసులకు ఖండన

ప్రజాశక్తి - బెలగాం

సిపిఎం రాష్ట్ర నేతలపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టడాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఒక ప్రకటనలో ఖండించారు. అంగన్వాడీ ఉద్యమానికి సంఘీభావంగా సిపిఎం రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్తున్న సందర్భంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు పెట్టారని పేర్కొన్నారు. గవర్నర్‌పేట పోలీసులు 14మంది సిపిఎం రాష్ట్ర, జిల్లా, నగర నేతలపై ఐదు సెక్షన్ల కింద అక్రమ కేసులు మోపారన్నారు. ఈ అక్రమ కేసులను, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

జాబ్ మేళాలో 202 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి స్థానిక తమ్మినాయుడు డిగ్రీ కళాశాల ఆవరణంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 12 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. 367 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వీరిలో 202 మంది వివిధ కంపెనీల్లో ఎంపికయ్యారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె వి ఉజ్వల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉద్యోగ మేళా నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. నిరుద్యోగ, యువతీ యువకులు అవకాశం అందిపుచ్చుకోవాలని అన్నారు. తమ్మినాయుడు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.తిరుపతిరావు మాట్లాడుతూ మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం ఇది ఐదోసారని, ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటువంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలను నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తామని అన్నారు. ఈ జాబ్ మేళాలో జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వహీదా, తమ్మినాయుడు స్కూల్ ప్రిన్సిపల్ బిజూ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్నుపై నేడు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో డిడిఒలకు (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు) ఆదాయపు పన్ను మదింపుపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఆర్.ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ అవగాహన సదస్సు ఉదయం 10.30 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లో జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సులో ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ పాల్గొంటారని, కావున అందరు డిడిఒలు, జిల్లా అధికారులు పాల్గొని ఆదాయపు పన్ను మదింపుపై అవగాహన పొందాలని ఆయన కోరారు.

ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ రామచంద్రరావు

అక్రమాలపై ఆగ్రహం

సిబ్బంది పనితీరుపై అధికారులు అసంతృప్తి

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధిహామీ సిబ్బంది అక్రమాలపై ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు ఫీల్డ్ , టెక్నికల్ అసిస్టెంట్లను ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీల ఆర్థిక సంవత్సర ఉపాధి పనులు, విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ పనుల నిమిత్తం రూ.19.78 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో రూ.17 కోట్ల 18 లక్షల పంచాయతీరాజ్ పనులకు రూ.కోటీ 22 లక్షల, సర్వ శిక్ష అభియాన్ పనులకు మూడు లక్షల 25 వేలు పి.ఆర్.ఐ పనులు కింద ఒక కోటి 14 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వెటర్నరీశాఖకు రూ.1,86,000 కేటాయించినట్లు తెలిపారు. అనంతరం సోషల్ ఆడిట్ సిబ్బంది పంచాయతీల వారీగా అందించిన వివరాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ల విధి నిర్వహణలోటుపాట్లను పరిశీలించారు. అలసత్వం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లను మందలించారు. దిద్దుబాట్లతో కూడిన మాస్టర్లు ఉండకూడదన్నారు. వాలంటీర్లకు మూడు రోజుల పని కల్పించాలని, జాబ్ కార్డు అప్డేట్ తప్పనిసరి ఆదేశించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎస్.గోవింద్, కె.తిరుపతిరావు, జెడ్‌పిటిసి సభ్యులు అలజింగి రవికుమార్, ఎంపిపి నాగమణి, ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, ఎపిఒ కేశవరావు, ఇసి సిహెచ్.శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు తపాలా అదాలత్

పార్వతీపురం రూరల్ : తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం నిమిత్తం బుధవారం ఉదయం విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయంలో 111వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ ఎన్‌విఎస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆక్రమణకు గురైన భూములు పేదలకు ఇవ్వాలి

వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

పేదలకు, గిరిజనులకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన డి-పట్టా భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని తిరిగి పేదలకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్మికసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు, గిరిజనులకు డి పట్టా, అసైన్డ్ భూములను రెగ్యులర్ చేస్తూ 9/77 చట్టాన్ని సవరణకు తీసుకొచ్చిందని, ఈ చట్టం వల్ల జిల్లాలోని గిరిజన, దళిత, పేదల వద్ద ఉన్న భూములు పెద్దల వద్దకు చేరిపోతున్నాయని అన్నారు. ఈ ప్రాంతానికి 30,40 ఏళ్ల కిందట వచ్చి స్థిరపడిన పెత్తందారులు ఇక్కడున్న పేద గిరిజన, దళిత రైతుల వద్ద అతి తక్కువ ధరలకు తక్కువ విస్తీర్ణం అని చెప్పి ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. వాస్తవ హక్కుదారుల వద్ద భూముల్లేవని, వాటిని కొందరు రెవెన్యూ అధికారులు మాత్రం ఎవరైతే ఆక్రమించుకున్నారు వారి పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తున్నారని అన్నారు. అటువంటి వారిని వెంటనే సరెండర్ చేయాలన్నారు. ఆక్రమణలకు గురైన భూములను నిజమైన హక్కుదారులకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారి పై పిఒటి చట్టం కింద కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల జాబితాను విఆర్ఒలకు ఇచ్చి వాస్తవ హక్కుదారులను, సాగుదారులను గుర్తించి వారి పేర్లను గ్రామ సచివాలయంలో ప్రదర్శించాలని చెప్పినా ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్క సచివాలయంలోనూ జాబితా పెట్టలేదని అన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు సమాచారం సేకరించని విఆర్ఒలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, లేకుంటే వాస్తవ హక్కు దారులతో అన్యాక్రాంతమైన భూములపై వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందని తెలిపారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సమావేశంలో మాట్లాడుతున పీడీ కిరణ్‌కుమార్

మహిళలు వ్యాపారవేత్తలుగా తయారై లక్షాధికారులుగా ఎదగాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సిసిలకు, విఒఎలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని మహిళా సంఘ సభ్యులకు గ్రామ సంఘం పరిధిలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో గ్రామసంఘ అసిస్టెంట్ అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు ఆర్థికంగానే కాదు వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పడుతుందని, మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రతి మహిళా సంఘ సభ్యులు వాటా ధనం చెల్లించాలని తెలిపారు. ఎపిఎంలు పి.సురేష్, త్రినాధమ్మ, చేయూత ఎపిఎం సతీష్, మండల సమాఖ్య కార్యదర్శి వై.జగదీశ్వర, సిఇలు, విఒఎలు పాల్గొన్నారు.



డిఆర్ఒ వెంకటరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డిఆర్ఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యారంగంలో గల విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్ఒ జె.వెంకటరావు కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు 8నెలలుగా బకాయిగా నిలిచిన మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో, వసతి గహాల్లో మౌలిక సదుపాయాలు, సొంత భవనాలు లేక తీవ్ర అవస్థలుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు కాక, సరిపడా పాఠ్యపుస్తకాలు, మెరుగైన విద్య అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. మెరుగైన విద్య అందుబాటుకై జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, పాలకొండ గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని, గరుగుబిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, సాలూరు కళాశాల బాలుర హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, పార్వతీపురంలో గల గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గుమలక్ష్మీపురం, సాలూరు బాలురు పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో పెండింగులో ఉన్న డైనింగ్ హాల్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు ఆర్ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టళ్లకు ఎఎన్ఎంలను నియమించాలని, కార్పొరేట్, ప్రేవేట్ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు పర్చాలని, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మహిళా కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు నిరంతరం ఎదుర్కొంటున్న ఈ స్థానిక సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, లేనిచో భవిష్యతులో పెద్ద ఎత్తు జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, బి.గంగారావు, ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అక్టోబరు నుంచి గోధుమపిండి పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అన్ని మండలాల్లో తెల్లకార్డుదారులకు అక్టోబర్ నుండి పోర్టిఫైడ్ చక్కి గోధుమపిండి పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డుదారులకుకిలో పోర్టిఫైడ్ చక్కి గోధుమపిండి రూ.16కు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గిరిజన మండలాలకు కంది పప్పు

జిల్లాలో గల భామిని, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతంపేట మండలాలలో మొత్తం 1,86,465 తెల్లకార్డుదారులకు ఒక్కొక్క కార్డుదారుకు 1 కిలోకు రూ.67 చొప్పున పంపిణీ చేయనున్నట్లు జెసి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సంబంధిత కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతురాలి భర్తకు చెక్కును అందజేస్తున్న ఎంపిడిఒ సత్యం

మృతుడి కుటుంబానికి బీమా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి పంచాయతీ రేగుమానుగూడకు చెందిన సవర గయ్యారమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ మేరకు ఆమె భర్త సవర జమ్మడకు మంగళవారం ఎంపిడిఒ కొండపల్లి సత్యం, కార్యదర్శి కె.కామేశ్వరరావు వైఎస్ఆర్ బీమా 10000 చెక్కును అందజేశారు. అనంతరం ఎంపిడిఒ గొయిది పంచాయతీ రసూల్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. సర్వే శరవేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు

ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌ను మంగళవారం ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి తనిఖీ చేశారు. విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో ఏ మేరకు సామర్థ్యం ఉందో అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే సులభ పద్ధతుల్లో బోధించాలన్నారు. గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమసుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన సాధికారితపై నేడు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పార్వతీపురం

షెడ్యూలు తెగ (ఎస్టీ) సాధికారిత, అత్యాచారాల నియంత్రణ తదితర అంశాలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ (సిఐడి) విశాఖ ప్రాంతీయ కార్యాలయం డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.ఎస్.భూపాల్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవగాహన సదస్సును స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సులో రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ జివిడి శంకర రావు, జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఐటిడిఎ పిఒ తదితరులు హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సును సిఐడి పౌర హక్కుల రక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారులు డి గౌర్నాయుడు ఆర్ ఆనందరావుల ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం నర్సిపురం , కంబర వలస, వీరఘట్టం, నీలానగరం పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సామర్థ్యం వెలికి తీయడం , కే స్టడీ చేయడం , బిట్లు తయారు చేయడం , గ్రూప్ చర్చలు జరపడం , యజెండ ప్రాప్తికి స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించడం, స్కూల్ కాంప్లెక్స్ లో పొందిన శిక్షణ ఆధారంగా విద్యార్థులకు బోధించి పాఠశాలల బలోపేతానికి కషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త ఇళ్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

కొత్త గృహాల మంజూరుకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం తెలిపారు. గతంలో నాన్ యుడిఎ పరిధిలో సీతంపేట ఉండడం వల్ల కొత్త ఇళ్లు మంజూరు కాలేదని, ప్రస్తుతం కొత్త గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో గృహాల్లేని వారు వినియోగించుకోవాలని అన్నారు. కొత్తగా ఇళ్లు కావలనుకొన్నవారు సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వద్దకు అవసరమయ్యే ధ్రువపత్రాలతో వెళ్లి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశం ఈనెల 27 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఇందుకు సంబంధించిన శిక్షణను ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వెంకటేష్, మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంటలో ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాచిపెంట

విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 100 మంది మహిళలకు రొమ్ము, గర్భాశయంలో వచ్చే కేన్సర్‌కు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ లక్షణాలను ఐదుగురిలో గుర్తించామని, వీరికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించామని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పటల్ సూపరింటెండెంట్ సుభద్ర తెలిపారు. కేన్సర్ నిర్ధారణ అయితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తామని, పేద ప్రజలను ఇలాంటి కేన్సర్ మహమ్మారి నుంచి కాపాడాలని ప్రధాన ఉద్దేశంతోనే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు జి.వెంకటరమణ, రవిచంద్ర, ఎంపిపి బడ్నాన ప్రమీల, స్ఫూర్తి మహిళామండలి అధ్యక్షులు బలగ రాధ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్షా సమావేశం ఎంపిడిఒ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలకు ముందుగా ఇంటింటి సర్వేపై సమీక్ష నిర్వహించారు. అలాగే గ్రామాన్ని పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని, ప్రజలు వ్యాధుల బారినపడకుండా చూడాలని అన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేకరణ సరే.... కాలువల పరిస్థితేంటి?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ పరిధిలో గల 30 వార్డుల్లో ప్రతి రోజూ ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ ఆయా వార్డుల్లో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారేందుకు అవకాశం లేక దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలానికి ముందే కాలువల్లో పూడికలను తొలగించేందుకు సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలోని మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వీటితోపాటు కొన్ని ప్రాంతాలలో రోడ్లపై నీరు నిలిచిపోయి దోమలకు నిలయాలుగా మారుతుండడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురవడంతో పూడిక తీతలు తీసేందుకు అవకాశం లేదు కనుక ప్రజారోగ్య విభాగం అధికారులు పారిశుధ్య కార్మికులచే ఉదయం పూట ఇంటింటికి చెత్త సేకరణ చేయించి, మధ్యాహ్నం పూట కాలువలను శుభ్రం చేయించి ఈ సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో పేరుకు పోయిన చెత్త

జెఎస్ సర్వే శత శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) వైద్య శిబిరాల నిర్వహణకు ముందుగానే ఇంటింటి ఆరోగ్య సర్వే శత శాతం పూర్తి చేయాలని జెఎఎస్ ప్రత్యేక అధికారి డాక్టర్ టి.రమేష్ ఆదేశించారు. స్థానిక జిల్లా ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెఎఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలని, జెఎఎస్ శిబిరాల కోసం నిర్దేశించిన నివేదికలను ముందుగానే సందర్శించి సంబందిత శాఖలతో సమన్వయం జరిపి అక్కడ ఏర్పాట్లపై చర్యలు చేపట్టాలన్నారు. జెఎఎస్ వైద్య శిబిరంలో ఆరోగ్య సేవలు వినియోగించుకుని ప్రజలకు అర్థమయ్యేలా అక్కడ సిబ్బంది తగు దిశా నిర్దేశం చేయాలని, కౌంటర్లు వద్ద తెలుగులో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జెఎఎస్ కార్యక్రమం విజయవంతమయ్యేలా పక్కాగా ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బిఎస్‌కె అధికారి డి.భాస్కరరావు, కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారి కె.సుకుమార్, డిఐఒ టి.జగన్మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు కె.విజయపార్వతి, డి.శివకుమార్, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ కుమార్, నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

రాష్ట్రాభివృద్ధికి శ్రమించడమే తప్పా : శత్రుచర్ల

ప్రజాశక్తి - కురుపాం

నిలువ నీడలేని ఆంధ్రప్రదేశ్ కోసం నిరంతరం శ్రమించి, రాష్ట్రానికి దశ, దిశ చూపి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడం, రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించడమే చంద్రబాబు చేసిన తప్పా అని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాం టిడిపి కార్యాలయంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వం కుట్రలతో అక్రమ కేసులో ఇరికించారని మండిపడ్డారు. టిడిపి యువ నాయకులు వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ అక్రమమని అందరికీ తెలుసునని, అందుకే ఆయన కోసం దేశ, విదేశాల్లో ప్రజలంతా నిరసన తెలుపుతున్నారని అన్నారు. అది చూసైనే వైసీపీ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలని, చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి కన్వీనర్లు కలిశెట్టి కొండయ్య, శేఖరపాత్రుడు, అక్కేన మధు, టిడిపి నాయకులు కన్నా, కె. రామరాజు, ఎన్.కృష్ణబాబు, రావివలస ఎంపీటీసీ సుమన్, సంతోషపురం సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మొండెంఖల్ లో బాబుతో నేను కార్యక్రమం

మండలంలోని మొండెంఖల్ లో మంగళవారం బూత్ నెంబర్ 23, 24 క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రంజిత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన బాబుతో నేను కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులపై వివరించి రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని, అప్పుడే ఈ అరాచక ప్రభుత్వం అంతమై సుభిక్షమైన సుపాలి పాలన వస్తుందని అన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు కి నిరసనగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దీక్షలు చేపట్టారు. పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్‌లో నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన దీక్షలు కొనసాగించారు. అంతకుముందు మహిళలు పూర్ణ కలశాలతో ర్యాలీగా వెళ్లి కోట దుర్గ ఆలయం పూజలు చేశారు.

కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట సీనియర్ నాయకులు ఎం.సూర్యనారాయణ , మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : కుట్రలు, కుతంత్రాలు వైయస్ జగన్మోహన్ రెడ్డి నైజం అని, తమ అధినాయకులు చంద్రబాబు, నారా లోకేష్ పై ఎన్ని కేసులు పెట్టినా ప్రజల మద్దతుతో ధైర్యంగా ఎదుర్కొంటామని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా గత కొద్ది రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు నిరసన కార్యక్రమాల్లో భాగంగా కొత్తవలసలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవి, సీనియర్ నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల మద్దతు ఉన్న నాయకుడ్ని కుట్రలు కుతంత్రాలు ఏమీ చేయలేవని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్ నాయుడు, కౌన్సిలర్లు కే నారాయణ రావు, బడే గౌరీ నాయుడు, తాతపూడి వెంకట రావు, కోల సరితా మధు, నాయకులు బార్నాల సీతారాం బోను చంద్రమౌళి, పాలకొండ రాజశేఖర్ పోల సత్యనారాయణ, అమరాపు రామకృష్ణ, గురజాన చంద్రమౌళి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలో నాగూరులో గ్రామ దేవత శ్రీ రాగాలమ్మ తల్లికి గుడిలో అరకు పార్లమెంట్ జిల్లా తెలుగు మహిళా విభాగం అధికార ప్రతినిధి అక్కేన జగదీశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు చేసి చంద్రబాబుపే వెంటనే విడుదల చేయాలని, సైకో జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదన్ రావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వీరఘట్టం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని చంద్రబాబుకు తోడు మేము సైతం కార్యక్రమాన్ని చేపట్టారు. సైకో పోవాలి సైకిల్ రావాలి, అరాచక పాలన ముఖ్యమంత్రి మాకొద్దు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, పారిచర్ల వెంకటరమణ, బళ్ల హరిబాబు, మాచర్ల అనిల్‌కుమార్, బి.నీలకంఠంనాయుడు, ఎ.కుమారస్వామి, ఎన్.శశి కుమార్, సిహెచ్ ఉమామహేశ్వరరావు, కె.అప్పన్న, జామి సింహాచలం, యామక అప్పలనాయుడు, తాతబాబు, కృష్ణ, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

భామిని : స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమంటూ కళ్లకు గంతులు కట్టుకొని నిరసన చేపట్టారు. పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.జయకృష్ణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు భోగాపురపు రవి నాయుడు, మేడిబోయిన జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, అగతముడి గోవిందరావు, పాశర్ల నాగేశ్వర రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : దీక్షల్లో పాల్గొన్న శత్రుచర్ల విజయరామరాజు, వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్

భామిని : కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గిరిజనులకు టిడిపి చేసిందేమిటి? : వైసిపి

ప్రజాశక్తి - సాలూరురూరల్

టిడిపి హయాంలో గిరిజనులకు ఏం చేశారో చెప్పగలరా? ఆ పార్టీ గిరిజన సంఘ దారునాయక్‌ను మండలంలోని వైసిపికి చెందిన గిరిజన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బుతాడవలసలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయాంలో గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకపోయినా ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ఎన్ని సార్లు మీ నాయకులకు చర్చకు రమ్మన్నా రావటం లేదని, ఇకనైనా లేనిపోని ఆరోపణలు చేస్తే పోలీసులకు, చట్టానికి అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో మావుడి, కందుల పదం, కొత్తపరువు, కూరుకుట్టి, గంజాయిభద్ర, పగులు చెన్నూరు, పట్టు చెన్నూరు, తుండ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో గల శోభాలత దేవి కాలనీలో మరమ్మతులకు గురై బోరు నుంచి బురద నీరు గత రెండు రోజులుగా వస్తుంది. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఇఒ కె. చంద్రశేఖర్‌కు కాలనీ వాసులు మంగళవారం ఈ విషయం తెలిపారు. వెంటనే వారు స్పందించారు. బోరును కూలింగ్ పెట్టించి తాగునీటి ట్యాంకును శుభ్రపరచి మరమ్మతులకు గురై నీరు లీకవుతున్న ట్యాపులను బాగు చేయించి తాగునీరు అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ చెప్పిన వెంటనే స్పందించి మరమ్మతులు చేయించి తాగునీరు అందించినందుకు ఉప సర్పంచ్‌కు, పంచాయతీ ఇఒకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని నాగూరులో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామంలోని ప్రధాన వీధితో పాటు ఆయా వీధుల్లోని కాలువల్లో పూడికలు తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని గ్రామపంచాయతీ సర్పంచ్ కేతిరెడ్డి శిరీష తెలిపారు. అలాగే గ్రామానికి వచ్చే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇ- పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులంతా తాము పండిస్తున్న పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని పాంచాలి, గురువునాయుడుపేటలో ఇ-పంట నమోదు, ఇకెవైసి పరిశీలిస్తూ రైతులంతా ఇ-పంటలో నమోదయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 14,200 ఎకరాల పంటల రమోదు పూర్తయిందని, ఇంకా 2000 ఎకరాలు పంట నమోదు చేయాల్సిన అవసరం ఉందని పంటల నమోదు, ఇకెవైసి నమోదుకు ఆఖరి తేదీ సెప్టెంబర్ 30 అని తెలిపారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ద్వారా చిరుధాన్యాల కొనుగోలు కూడా జరుగుతుందని తెలిపారు. అలాగే అర్హత కలిగి ఇప్పటివరకు రైతు భరోసా రాని రైతులు ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవడం ద్వారా రైతు భరోసాకు అర్హత పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ హైమ, విఎఎ శ్రీను పాల్గొన్నారు.

నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలోని నీలకంఠాపురం, కురుపాం పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారాను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా నాటు సారా అమ్మకాలు, వంటకాలు చేపడితే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నాటు సారా అక్రమంగా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు సారా వల్ల కలిగే అనార్థాలపై ప్రజలను చైతన్యపరుస్తున్నామని అన్నారు.

వాహనాలు వేలం

నాటుసారా తరలిస్తున్న క్రమంలో పట్టుబడిన పలు వాహనాలను మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను డిఎస్‌పి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు, నీలకంఠాపురం, కురుపాం ఎస్ఐ పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలు వేలం

సీతంపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు సమక్షంలో నాటుసారా అక్రమ రవాణా కేసులో పట్టుబడి సీజ్ చేయబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించారు. అందులో మూడు బైకులు వేలంపాటలో పాడుకోగా, ఆటోను వేలంపాటలో ఎవరూ పాడ్డానికి ఆసక్తి చూపించలేదు. రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ రూ.82,000 హీరో హెూండా సిడి డాన్ బైక్ రూ.2300, హీరో హెూండా స్పెండర్ రూ,2300కు వెళ్లారు. కార్యక్రమంలో ఎస్సై ఏ నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెల 29న ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశం మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతోందని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరవుతారన్నారు. సమావేశానికి పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కంబర వలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతకుమారి, ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు దోహదం

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధనకు స్కూల్ కాంప్లెక్స్‌లు, శిక్షణా తరగతులు ఎంతో దోహదపడతాయని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. మండలంలోని అరసాడ, వంతరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్‌ల శిక్షణా కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ పరంగా అమలు చేస్తున్న నూతన విద్యా విధానాలను ఉపాధ్యాయులు అవగాహన చేసుకునేందుకు కాంప్లెక్స్ శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాగే ఈ శిక్షణలో నేర్చుకున్న నూతన విద్యా విధానాలను పాఠశాల స్థాయిలో బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం లీడర్ షిప్ ట్రైనింగ్ కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ అందించేందుకు ఐఎఫ్‌పి ప్యానెల్స్ సరఫరా చేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నాడు - నేడు పనుల తీరును, జగనన్న గోరుముద్ద పథకాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒక రైతు పొలంలో పంట వేసిన తర్వాత దిగుబడికి ఏ విధంగా కృషి చేస్తారో అలాగే ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల చదువు పట్ల ఆసక్తి కలిగేలా అన్ని కోణాల్లో స్నేహభావంతో విద్యా బోధన చేపట్టాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి చదువులో శత శాతం ఉత్తీర్ణత సాధనకు అవకాశం ఉంటుందన్నారు. ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిఉపాధ్యాయుడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి ఫేషియల్ యాప్ వేయాలని, లెస్సన్ ప్లాన్స్ ప్రకారం విద్యా బోధన చేయాలని సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 బి.జనార్ధన నాయుడు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థుల విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మంగళవారం విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉత్తమమైన శిక్షణను ఇప్పించాలని సూచించారు. పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయనున్నట్టు గరుగుబిల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. మండలంలోని గొట్టివలస అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో భాగంగా రాష్ట్రీయపోషణమాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూఈ నెల30 వరకు రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని గర్భిణులు, శిశువులు, కిశోర బాలికలు తదితర వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. "సుపోషిత్ భారత్, సాక్షర భారత్, సశక్త భారత్" శీర్షికన రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిశువులకు తల్లిపాలు, అదనపు ఆహారం, పౌష్టికాహారం పెంపొందించడం, రక్తహీనత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పౌష్టికాహారం తయారీ విధానం, చిరు ధాన్యాలు వినియోగం, ఉపయోగాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు మర్రాపు సావిత్రి, పెద్దింటి మీనాక్షి, చింతల పద్మ, జి.గుణవతి, రౌతు పద్మావతి, మూడడ్ల స్వాతి, పొగిరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో గజరాజుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ పంచాయతీ గిరిశిఖర గ్రామాల్లో మంగళవారం నాలుగు ఏనుగుల గుంపు సంచరించింది. గిరిజనులు సాగు చేస్తున్న కొండచీపుర్లు, అరటి, పసుపు తదితర అటవీ ఉత్పత్తులను, తాగునీటి పైపులు, ట్యాంకులను ధ్వంసం చేస్తున్నాయి. ఇంతవరకు ప్రశాంతంగా ఉన్న గిరి శిఖర గ్రామాల్లో ఏనుగులు సంచరించడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందని గిరిజనులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఇంటింటా జగనన్న ఆరోగ్యసురక్ష

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు ఐదవ వార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు కుటుంబ సభ్యులతో ఆరోగ్య సురక్ష లో అందిస్తున్న సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం బిపి, షుగర్ టెస్ట్‌లు ఇంటి వద్దకే వచ్చి చేయడం జరుగుతుందని వెల్లడించారు.

నేడు జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం గరుగుబిల్లిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించ వచ్చుని తెలిపారు. ఎమ్మలక్ష్మిపురం మండలాల్లో జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆర్‌డిఒ కె.హేమలత మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి పరిశీలించారు. ఆమె వెంట ఎంపిడిఒ అర్జున్, తహశీల్దార్ నాగార్జున్ ఉన్నారు.

పౌల్ట్రీలు సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండ, దిశరిగూడ, చినరామ గ్రామాల్లో వాసన్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్మించిన పౌల్ట్రీ బ్రీడ్ ఫార్మ్‌లను నేషనల్ పౌల్ట్రీ కన్సల్టేషన్‌లో భాగంగా ట్రై కార్ జనరల్ మేనేజర్ మణికుమార్ మంగళవారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఫీల్డ్ పౌల్ట్రీ సభ్యులు ఏ విధంగా నిర్వహణ చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. కోళ్ల పౌల్ట్రీలతో ఆదాయ లాభాలతో పాటు ఆహారంగా తీసుకుంటే పోషకాలు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు న్యూఢిల్లీ చైర్మన్ డికె సధాన, అసోసియేషన్ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు, ఆర్ట్స్ కోఆర్డినేటర్ శంకర్రావు, నేషనల్ కోఆర్డినేటర్ సవ్యసాచి దాస్ తదితరులు పాల్గొన్నారు.